కేఆర్ఎంబీకి ఇస్తామని చెప్పలేదు

- ప్రాజెక్టుల అప్పగింతపై కేంద్రానికి హామీ ఇవ్వలేదు
- కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించిందనడం అవాస్తవం
- ఈ విషయంలో గతంలోనే తప్పు జరిగింది
- మేడిగడ్డ డ్యామేజీ అనుకున్నదానికన్నా పెద్దది
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): కృష్ణా సాగునీటి ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగిస్తామని తమ ప్రభుత్వం కేంద్రానికి హామీ ఇవ్వలేదని, ఇస్తామని కూడా చెప్పలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. దీనిపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు. శనివారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ...ఈ విషయంపై గతంలోనే తప్పు జరిగిందని అన్నారు. ఈ అంశాన్ని శాసనసభలో చర్చకు పెడతామని తెలిపారు. ఇటీవల కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను తాను, సీఎం రేవంత్‌రెడ్డి కలిసినప్పుడు కృష్ణా ప్రాజెక్టులను యథావిధిగా ఉంచాలని కోరినట్టు చెప్పారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి..రెండు రాష్ట్రాల సీఎంలు కలిసి అపెక్స్ మీటింగ్ ఏర్పాటు చేసుకుంటే కేంద్రం ఆలోచనను చెప్తామని అన్నట్టు వెల్లడించారు. గత సీఎం కేసీఆర్, ఏపీ సీఎం జగన్ గంటల కొద్ది మాట్లాడుకొని ఏం చేశారని ప్రశ్నించారు. పదేండ్లలో కృష్ణా నీటివాటా ఎందుకు తగ్గిందని నిలదీశారు. గ్రావిటీ ద్వారా వచ్చే కృష్ణా నీళ్లను ఏపీ తరలించుకుపోతుంటే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల పరిస్థితి ఏంటని విలేకరుల ప్రశ్నించగా గతంలో ఎలా ఉన్నదో ఇప్పుడు అలాగే ఉన్నదని తెలిపారు. మేడిగడ్డలో ఊహించినదానికన్నా ఎక్కువ నష్టం జరిగిందని చెప్పారు. డిజైన్, నిర్మాణ లోపం తోనే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. మేడిగడ్డలో ఏం జరిగిందో తేల్చేందుకు ఇంకా సమయం పడుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు మూలాలే కూలిపోయే పరిస్థితి ఉన్నదని తెలిపారు. ఇందుకు సంబంధించి కొన్ని ఫొటోలు తనకు అందాయని, వీటిని త్వరలోనే విడుదల చేస్తామని వెల్లడించారు.

సచివాలయంలో 'పునాస' త్రైమాసిక సాహిత్య పత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు. చిత్రంలో పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ , పర్యాటక శాఖ ఎండీ రమేశ్‌నాయుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు

'అయోధ్య లైవ్' లింకులు ఓపెన్ చేయొద్దు

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : 'అయోధ్య లైవ్' పేరిట వచ్చే లింకులు ఓపెన్ చేయొద్దని తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు కోరారు. రాముడి ప్రాణ ప్రతిష్ఠ వేడుకల లైవ్ అంటూ, విశేషాలంటూ.. ఇలా వేర్వేరు పేర్లతో లింక్‌లు పంపుతూ సైబర్ నేరస్థులు దోపిడీలకు పాల్పడే అవకాశం ఉన్నదని, ఫోన్లకు వచ్చే సందేశాలను, వాట్సాప్ లింక్‌లను, మెయిల్స్ ను ఓపెన్ చేయొద్దంటూ సూచించారు.

మినిట్స్ అబద్ధమా?

- సంతకం చేయకుంటే కేంద్రాన్ని నిలదీయాలి
- తెలంగాణను కాపాడుతారా? బలిపెడుతారా?
- ప్రాజెక్టులు కేఆర్ఎంబీకిస్తే రాష్ట్రానికి శరాఘాతమే
- కృష్ణాపై తెలంగాణ ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్థకమే
- అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లండి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్

నాడు నోరు మెదపకుండా

సీలేరు, ఏడు మండలాలు ఆంధ్రాలో కలపడంపై ఇప్పుడు మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు, ఆ రోజు ఎందుకు నోరు మెదపలేదని నిరంజన్ రెడ్డి నిలదీశారు. నీళ్ల విషయంలో తెలంగాణ ప్రయోజనాలపై కేంద్రంతో కేసీఆర్ ఏనాడూ రాజీపడలేదని తెలిపారు. గోదావరి బేసిన్‌లో రైతులకు సాగునీళ్లు ఇవ్వకుండా కాళేశ్వరం మీద దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా ఇవ్వబోమని కేంద్రం చెప్తే చేతులు ముడుచుకుని ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌ను 100 మీటర్ల లోతులో బొంద పెడతామన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనపై నిరంజన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్‌ను బొంద పెడతామన్నవాళ్లు చాలామంది బొందలో కలిసిపోయారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం వచ్చి 45 రోజులైనా హామీల గురించి దృష్టి పెట్టలేదని విమర్శించారు.

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగిస్తామని రాష్ట్రప్రభుత్వం సంతకం చేయడమంటే తెలంగాణ ప్రజల గొంతు కోయడమేనని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఒకవేళ రాష్ట్రం మినిట్స్‌పై సంతకం చేయకుంటే వెంటనే అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రాన్ని నిలదీయాలని సూచించారు. ఈ నెల 17న కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సమావేశానికి హాజరైన తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు సమావేశ మినిట్స్ చూసి అభ్యంతరం చెప్పకుండా ఎందుకు అంగీకరించారని ప్రశ్నించారు. రాష్ట్రం ఒప్పుకోకపోయినా కేంద్రం మీటింగ్ మినిట్స్ చేరిస్తే వాటిపై వెంటనే అభ్యంతరం తెలపాలని డిమాండ్ చేశారు. కృష్ణా నీటిలో తెలంగాణకు శాశ్వత కేటాయింపులు జరగకుండా శ్రీశైలం, నాగార్జునసాగర్, వాటి పరిధిలోని ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తే తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుందని హెచ్చరించారు. ఆ ప్రాజెక్టులు రాష్ట్ర పరిధిలోనే ఉండేలా స్టేటస్ కో మెయింటెయిన్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను కాపాడుతుందా? బలిపెడుతుందా? అని నిలదీశారు. శనివారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్, బీఆర్ఎస్ నేత గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తే ఆంధ్రప్రదేశ్‌కే ప్రయోజనమని, వారు కోరుకున్నదే ఇప్పుడు జరిగిందని అన్నారు. ఇన్నాళ్లు ఆ నిర్ణయాన్ని కేసీఆర్ నిలువరించారని, కాంగ్రెస్ ప్రభుత్వం నిలువరించడంలో విఫలమైందని మండిపడ్డారు.

మినిట్స్‌పై ఎందుకు స్పందించరు?

తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నదే నీళ్ల కోసమని, ఎన్ని వత్తిళ్లు ఎదురైనా రాష్ట్ర ప్రయోజనాల కోసమే కేసీఆర్ నిలబడ్డారని నిరంజన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో పాలమూరు– రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల, సాగర్, శ్రీశైలంతో పాటు కొత్త ప్రాజెక్టులకు గండి పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. నమ్మి ఓట్లేస్తే కాంగ్రెస్ పార్టీ పాలమూరు, నల్లగొండ, ఖమ్మం ప్రజల గొంతుకోసిందని ధ్వజమెత్తారు. ఆంధ్రా ప్రయోజనాల కోసం కేంద్రం చేస్తున్న ప్రయత్నాలకు తెలంగాణ ప్రభుత్వం వంత పాడుతున్నదా? అని ప్రశ్నించారు. కేఆర్ఎంబీ పరిధిలోకి డ్యామ్‌లు వెళితే శ్రీశైలంలో విద్యుత్తు ఉత్పత్తి చేసుకునే వెసులుబాటు ఉండదని, రాష్ట్రానికి కరెంటు కష్టాలు మొదలైతాయని హెచ్చరించారు. 15 అవుట్‌లెట్‌లను కేఆర్ఎంబీ స్వాధీనం చేసుకొన్నా ఏపీ ప్రభుత్వమే వాటిని నిర్వహిస్తుందని తెలిపారు. కేఆర్ఎంబీ ప్రకటనపై రాష్ట్ర మంత్రుల స్పందన విచిత్రంగా ఉన్నదని, అపర మేధావులు అనేకునే కొందరు దీనిపై ఎందుకు స్పందించడంలేదని నిలదీశారు.

ఆర్టీసీ ఉద్యోగుల బీమా రూ.కోటి

- ప్రీమియం చెల్లించకుండానే 1.12 కోట్ల వరకు బీమా వర్తింపు
- యూబీఐతో టీఎస్ఆర్టీసీ ఒప్పందం

ఒప్పంద పత్రాన్ని చూపిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్, యూబీఐ సీజీఎం

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ ఉద్యోగుల ప్రమాద బీమా 40 లక్షల నుంచి కోటికిపైగా పెరిగింది. ఈ మేరకు ప్రమాద బీమా పెంపుపై యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)తో సంస్థ శనివారం ఒప్పందం చేసుకున్నది. హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ప్రమాద బీమా పెంపుపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్, యూబీఐ సీజీఎం అండ్ జోనల్ హెడ్ భాస్కర్‌రావు ఒప్పందం చేసుకున్నారు. రోడ్డు ప్రమాదాల్లో అకాల మరణం చెందిన, శాశ్వతంగా దివ్యాంగులైన సిబ్బందికి బీమా వర్తించనున్నది. యూబీఐ సూపర్ శాలరీ సేవింగ్ అకౌంట్ (యూఎస్ఎస్ఏ) కింద కోటి ప్రమాద బీమాను అందించనున్నారు. రూపే కార్డుతో మరో 12 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. ఎలాంటి ప్రీమియం చెల్లించకుండానే మొత్తంగా 1.12 కోట్ల వరకు ప్రమాద బీమాను బాధిత కుటుంబాలకు సంస్థ అందించనున్నది. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి బీమా అమల్లోకి రానున్నది. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. యూబీఐ సూపర్ శాలరీ సేవింగ్ అకౌంట్ కింద ప్రమాదాల్లో మరణించిన 12 మంది సిబ్బంది కుటుంబాలకు 40 లక్షల చొప్పున అందజేశామని తెలిపారు. గతంలో శాలరీ శ్లాబులతో ప్రమాద బీమా ఇచ్చేవారని, ఇకపై వాటితో సంబంధం లేకుండా ప్రతి ఒక్క సిబ్బందికి కోటి బీమా వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ సీవోవో రవీందర్, ఈడీలు కృష్ణకాంత్, పీవీ మునిశేఖర్, వినోద్‌కుమార్, వెంకటేశ్వర్లు, ఫైనాన్స్ అడ్వయిజర్ విజయ పుష్ప, సీపీఎం ఉషాదేవి, యూబీఐ జనరల్ మేనేజర్ కృష్ణన్, డిప్యూటీ జోనల్ హెడ్‌లు రవికుమార్, అర్వింద్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల రిపేర్‌కు 35 లక్షలు!

- గన్‌మెన్ రూములకు రూ.29 లక్షలు
- నాడు కేసీఆర్‌ను విమర్శించి నేడు భట్టి చేస్తున్నదేమిటి?
- ప్రజాభవన్‌లో మరమ్మతులపై నెట్టింట విమర్శలు

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన నివసించిన ప్రగతిభవన్‌పై కాంగ్రెస్ నాయకులు చేయని విమర్శలు లేవు. కేసీఆర్ తన విలాసాల కోసం ప్రగతి భవన్‌ను కట్టుకున్నాడని, ప్రజాధనాన్ని వృథా చేశారని అన్నారు. ఆ భవనాన్ని కేసీఆర్ రాజకీయ అహంకార కేంద్రం అంటూ వ్యాఖ్యానించారు. ఆ భవనాన్ని స్టడీ సెంటర్‌గా మారుస్తామని, లేదా దానిని ప్రభుత్వ దవాఖానగా మారుస్తామని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంచుతామని కాంగ్రెస్ నేతలు ఆర్భాటంగా ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆ భవనాన్ని తన నివాసంగా మార్చుకున్నారు. నాడు కేసీఆర్‌ను తన విలాసాల కోసం ప్రగతి భవన్‌ను నిర్మించుకున్నారని విమర్శించిన కాంగ్రెస్ పార్టీ నేడు కేవలం ఆ భవనంలో మరమ్మతుల కోసం కొన్ని కోట్ల రూపాయలను వెచ్చించేందుకు సిద్ధపడటంపై నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు. ఆ భవన్‌లో మరుగుదొడ్ల మరమ్మతుకు, జిమ్, గన్‌మెన్ల గదుల కోసం భారీ ఎత్తున టెండర్లు పిలవడం ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశమైంది. కేవలం మరుగుదొడ్ల మరమ్మతు కోసం రూ.35 లక్షలకు కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించడంపై ముక్కున వేలేసుకుంటున్నారు. దోమ తెరల కోసం కూడా టెండర్లు ఆహ్వానించడంపై నెటిజన్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జిమ్ రూంలో పొడుగు అద్దాలు, గన్‌మెన్‌ల గదుల కోసం రూ.28.70 లక్షలకు టెండర్లు ఆహ్వానించినట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఆ టెండర్లకు సంబంధించిన కాపీలు సోషల్ మీడియాలో వైరల్ అవతుండటంతో సర్కార్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'ప్రజా భవన్‌లో తమ రాజకీయ విలాసాల కోసం కాంగ్రెస్ పార్టీ సిద్ధపడింది' అంటూ కామెంట్లు పెడుతున్నారు. 'కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదలెట్టింది' పోస్టులు పెడుతున్నారు. 'ప్రజల సొమ్ము దుర్వినియోగం చేయొద్దు భట్టీగారూ' అంటూ మరో నెటిజన్ కామెంట్ చేశాడు. అయితే, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ టెండర్లపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

రేపు సెలవుదినంగా ప్రకటించాలి

- ప్రభుత్వానికి వీహెచ్‌పీ డిమాండ్

సుల్తాన్‌బజార్, జనవరి 20: అయోధ్య రామమందిరంలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నేపథ్యంలో సోమవారం సెలవుదినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, సహకార కార్యదర్శి భానుప్రసాద్, సంపర్క్ ప్రముఖ్ వెంకటేశ్వరరాజు తదితరులు డిమాండ్ చేశారు. సీఎం అందుబాటులో లేకపోవడంతో శనివారం సచివాలయంలోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఓఎస్డీకి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించి హిందువుల మనోభావాలను గౌరవిస్తూ అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రం హాఫ్‌డే సెలవు ప్రకటించగా, అనేక రాష్ట్రాలు సెలవు దినంగా ప్రకటించాయని అన్నారు.

పారదర్శకంగా ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్

- అధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచన
- బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష

సమీక్షలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, చిత్రంలో వెంకటరెడ్డి

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): భవిష్యత్తు తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పారదర్శకంగా, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండేలా రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) అలైన్‌మెంట్‌ను రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అధికారులకు సూచించారు. శనివారం ఆయన సచివాలయంలో ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి 2024–25 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై ఉన్నతాధికారులతో చర్చించారు. ట్రిపుల్‌ఆర్ భూసేకరణతోపాటు నల్లగొండ, హైదరాబాద్ కలెక్టరేట్లు, వివిధ ఆర్వోబీలు, ఆర్‌యూబీలు, వీయూబీల నిర్మాణం, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో రోడ్ నెట్‌వర్క్ పెంపునకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్న ఆర్‌అండ్‌బీ శాఖ ప్రతిపాదనలను డిప్యూటీ సీఎం పరిశీలించారు. రాష్ట్రంలో సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్)తో చేపట్టే నిర్మాణాలకు భూసేకరణలో ఇబ్బందులు రాకుండా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని మంత్రి కోమటిరెడ్డి చేసిన విజ్ఞప్తికి అంగీకారం తెలిపారు.

చిన్న సినిమాలకు అడ్డంకులు తొలగించాలి

సినిమాటోగ్రఫీ శాఖపై జరిగిన చర్చలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. చిన్న సినిమాల విడుదలకు ఎదురవుతున్న ప్రతిబంధకాలను తొలగించాలని, రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి కేటాయించిన భూములను కాపాడలని అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాల వ్యసనానికి వ్యతిరేకంగా చేపట్టే ప్రచారంలో పాల్గొనేలా సినీ ప్రముఖులను ఒప్పించేందుకు ప్రయత్నించాలని సూచించారు. సినీ కళాకారులకు అందించే నంది పురస్కారాలపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

థియేటర్లలో చిరుతిళ్ల ధరలను నియంత్రించాలి

సినిమా హాళ్లలో చిరుతిళ్లను భారీ రేట్లకు అమ్మకుండా చర్యలు చేపట్టాలని మంత్రి కోమటిరెడ్డి అధికారులను ఆదేశించారు. దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లోని థియేటర్లలో చిరుతిళ్ల ధరలు వందల రెట్లు అధికంగా ఉంటున్నాయని, దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్‌అండ్‌బీ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస రాజు, ఫైనాన్స్ జాయింట్ సెక్రటరీ హరిత, డిప్యూటి సీఎం సెక్రటరీ కృష్ణభాస్కర్, ఈఎన్సీలు రవీందర్‌రావు, గణపతిరెడ్డి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఓటరు దరఖాస్తులు 43 వేలు

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): ఓటరు నమోదులో భాగంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక క్యాంపుల్లో 43 వేల దరఖాస్తులు అందినట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. శని, ఆదివారాల్లో రాష్ట్రవ్యాప్తంగా బూత్‌స్థాయిలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు. జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకునేందుకు, ఓటు తొలగింపు, చిరునామా మార్పునకు అవకాశం కల్పించారు. శనివారం కొత్త ఓటు కోసం 25,347 దరఖాస్తులు, ఓటు తొలగింపునకు 7,984, చిరునామా మార్పు, వివరాల సవరణకు 9,845 దరఖాస్తులు వచ్చినట్టు ఎన్నికల అధికారులు వెల్లడించారు. శనివారం జిల్లా ఎన్నికల అధికారులు 256 పోలింగ్‌స్టేషన్లను సందర్శించారు. 35,356 పోలింగ్ కేంద్రాలుండగా, 10 మంది బీఎల్‌వోలు మినహా మిగిలిన వారందరూ అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఆదివారం కూడా ప్రత్యేక క్యాంపులు ఉంటాయని సూచించారు.

అప్పుల్లో పౌరసరఫరాల సంస్థ

- 58 వేల కోట్ల అప్పులున్నాయ్
- ఆ శాఖకు గత ప్రభుత్వం నిధులివ్వలేదు
- ఆర్థికంగా నిర్వీర్యం చేశారు
- మంత్రులు భట్టి, ఉత్తమ్ ఆరోపణలు

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ అప్పుల్లో కూరుకుపోయిందని, గత ప్రభుత్వ నిర్లక్ష్యమే ఇందుకు కారణమని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆరోపించారు. ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వనిదే పౌరసరఫరాల సంస్థ నడవలేని స్థితిలో ఉన్నదని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలపై శనివారం సమీక్ష జరిపిన అనంతరం ఆయన పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. 2016–17 నుంచి ఇప్పటివరకు పౌరసరఫరాల సంస్థ అప్పులు రూ.58,860 కోట్లకు పెరిగినట్టు చెప్పారు. గత ప్రభుత్వం రేషన్ బియ్యం సరఫరాకు కూడా నిధులు ఇవ్వలేదని, ఇందుకు సంబంధించిన బకాయిలే రూ.14,354 కోట్లు ఉన్నాయని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు, బియ్యం సరఫరాకు గత ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించలేదని, దీంతో ప్రతినెల రూ.3 వేల కోట్లు వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఎన్ని అప్పులున్నా రేషన్ బియ్యం పంపిణీ, విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనాన్ని అందించడం, ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థను ఆర్థికంగా నిర్వీర్యం చేసిందని, ఇప్పటికే రూ.15 వేల కోట్ల విలువైన ధాన్యం మిల్లర్ల వద్ద ఉన్నదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి: టీఎన్జీవో

నూతన పీఆర్సీ, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రభుత్వాన్ని కోరింది. సీపీఎస్ విధానం రద్దు చేయాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది. శనివారం హైదరాబాద్‌లోని జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. తెలంగాణ అర్ధగణాంక శాఖ ఫోరం డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో ప్రతినిధి బృందం నేతలు పలు అంశాలపై డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందజేశారు. జీవో –317తో జరిగిన అన్యాయాలను సరిచేయాలని కోరారు. అర్థగణాంకశాఖ స్టాఫ్ ప్యాట్రన్, ఉప గణాంకశాఖ అధికారి పోస్టును మల్టీజోన్ పోస్టుగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, టీఎన్జీవో సహ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, హరికృష్ణ, మంత్రిప్రగడ శ్రీనివాస్, వేణుమాధవ్, శివకుమార్, నర్సింహాచారి, వెంకటరమణ, కట్ట వెంకట్, నగేష్, దుర్గేశ్, రవి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఇంజినీర్ల సమస్యను పరిష్కరించాలి

విద్యుత్ సంస్థల్లో రివర్షన్‌కు గురైన విద్యుత్తు ఇంజినీర్లకు న్యాయం చేయాలని సీపీఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు కోరారు. ఈ మేరకు శనివారం ఉప ముఖ్యమంత్రి, విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్కను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రివర్షన్ చేసిన ఇంజినీర్లను వారి వాస్తవ పోస్టులోకి తీసుకొని, పదోన్నతులు కల్పించాలని కోరారు. సాధ్యమైనంత వరకు వారికి న్యాయం చేద్దామని ఎమ్మెల్యేకు డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు.

చౌడాపూర్‌లో చెత్తట్రాక్టర్‌లో దొరికిన ఆధార్, ఐడీ కార్డులు, విలువైన ఉత్తరాలు

చెత్తకుప్పలో ఆధార్‌కార్డులు

- ఉత్తరాలు, ఐడీ, పాన్‌కార్డులూ లభ్యం
- పంచకుండా పడేసిన పోస్టుమ్యాన్
- 2011 నుంచి పంపిణీలో నిర్లక్ష్యం
- తహసీల్దార్‌కు కార్డుల అప్పగింత
- ఘటనపై అధికారుల విచారణ

కులకచర్ల, జనవరి 20: గ్రామాల్లో ప్రజలకు భద్రంగా అందాల్సిన ఆధార్, పాన్ కార్డులు, పలు ఉత్తరాలు శనివారం గ్రామ పంచాయతీలో చెత్త సేకరణకు వచ్చిన ట్రాక్టర్‌లో దర్శనమిచ్చాయి. వాటిని చూసిన గ్రామస్థులు.. భద్రంగా ప్రజలకు అందజేయాల్సిన పోస్టుమ్యాన్ నిర్లక్ష్యంగా ఇలా పడేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలం చౌడాపూర్‌లో చోటుచేసుకున్నది.మండల పరిధిలోని చౌడాపూర్, మండిపల్, వీరాపూర్, విఠలాపూర్, అడవివెంకటాపూర్, ముక్తవెంకటాపూర్ గ్రామాలకు నర్సింలు పోస్టుమ్యాన్‌గా పనిచేస్తున్నాడు. 2011 నుంచి ప్రజలకు ఆధార్, పాన్ కార్డులు, ఇతర పోస్టు కార్డులు వందల సంఖ్యలో వచ్చాయి. వాటిని ప్రజలకు అందించకుండా ఇంట్లోనే సంచిలో దాచి ఉంచాడు. పోస్టుమ్యాన్ కూతురు అనుకోకుండా శనివారం గ్రామ పంచాయతీ ద్వారా చెత్త సేకరణకు వచ్చిన ట్రాక్టర్‌లో ఆ ఉత్తరాల సంచిని పడేసింది. ఈ సంచిని గమనించిన గ్రామస్థులు.. ట్రాక్టర్‌ను ఆపి చెత్తలో నుంచి ఐడీ కార్డులను తీసి చూడగా వందల సంఖ్యలో ఆధార్, పాన్ కార్డులు దొరికాయి. గ్రామానికి చెందిన చాలా మంది అక్కడికి వచ్చి తమ ఆధార్ కార్డులను తీసుకున్నారు. మిగిలిన కార్డులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో అప్పగించారు. దీంతో గ్రామస్థులు.. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పోస్టుమ్యాన్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. చెత్త ట్రాక్టర్‌లో దొరికిన ఆధార్ కార్డులపై నవాబుపేట్ పోస్టాఫీసు సిబ్బంది విచారణ చేపట్టారు. తహసీల్దార్ నుంచి సమాచారం సేకరించారు. ఈ సంఘటనకు సంబంధించి.. పూర్తి వివరాలను ఉన్నతస్థాయి అధికారులకు పంపిస్తామని పోస్టాఫీసు అధికారులు తెలిపారు.

ఏడాదిలోగా ఒకేసారి రుణమాఫీ

- బిల్లుల కోసం గ్రామాల సర్పంచులు ఆందోళన వద్దు
- సారంగాపూర్ మండలంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్, జనవరి 20: ఏడాది లోపు రైతుల రుణాలను ఏకమొత్తంలో మాఫీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామాల్లో నిధుల కొరత ఉన్నా సర్పంచులు అభివృద్ధిలో ముందుకు పోతున్నారని, బిల్లులు రాలేదని ఆందోళన చెందవద్దని, ప్రభుత్వ పథకాలకు కొనసాగింపుగా తమ ప్రభుత్వం పని చేస్తుందని ఆయన చెప్పారు. ఈ మేరకు శనివారం ఆయన జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. మార్చిలో ప్రవేశపెట్టే బడ్జెట్ ఆమోదం పొంది సర్పంచులకు చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. యూపీఏ ప్రభుత్వంలో తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం కూలీలకు పని భద్రత కల్పించిందని గుర్తుచేశారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. సర్పంచులకు రావాల్సిన బిల్లులను మార్చి నెల వరకు ప్రభుత్వం తప్పకుండా చెల్లిస్తుందని భరోసా ఇచ్చారు.

ఆయిల్‌పామ్‌కు మద్దతు ధర ఇవ్వండి

- క్వింటా రూ.18 వేలు ఉండాలి
- పసుపు, మిర్చికీ మద్దతు ఇవ్వాలి
- రైతులకు గిట్టుబాటు కావాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): ఆయిల్‌పామ్‌కు మద్దతు ధర ఇవ్వాలని, క్వింటాలుకు రూ.18 వేలు నిర్ణయించాలని కమిషన్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్ అండ్ ప్రైజెస్ (సీఏసీపీ)ను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. దీంతో పాటు పసుపు, మిర్చికీ మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. శనివారం గోల్కొండ హోటల్‌లో నిర్వహించిన దక్షిణ రాష్ట్రాల సీఏసీపీ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. రైతులకు సాగు ఖర్చులకు తగ్గట్టుగా మద్దతు ధర రావడం లేదని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా మద్దతు నిర్ణయించాలని కోరారు. సీఏసీపీ చైర్మన్ విజయ్‌పాల్ శర్మ మాట్లాడుతూ.. వైవిధ్యమైన పంటల సరళి లేకపోవడంతో రైతులకు గిట్టుబాటు ధర రావటం లేదని, ప్రస్తుత పరిస్థితుల్లో మార్కెట్ డిమాండ్‌కు అనుగుణమైన అపరాలు, నూనెగింజల పంటలను పండించాలని సూచించారు.

నకిలీ మందుల నియంత్రణలో భేష్

- ఇంటర్‌పోల్ అభినందన

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో నకిలీ ఔషధాలను నియంత్రించడంలో రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) విభాగం చురుగ్గా పనిచేస్తున్నదని ఇంటర్‌పోల్ అధికారులు అభినందించారు. ఈ మేరకు ఇంటర్‌పోల్ నుంచి తెలంగాణ డీసీఏకు మెయిల్ ద్వారా అభినందన లేఖ వచ్చినట్టు సంస్థ డైరెక్టర్ జనరల్ వీ కమలాసన్‌రెడ్డి శనివారం తెలిపారు. నకిలీ డ్రగ్స్ లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని డీజీ కమలాసన్‌రెడ్డి తెలిపారు.

మలక్‌పేటలో నకిలీ ఫార్మసీ లైసెన్స్

మలక్‌పేటలోని ఐశ్వర్య ఫెర్టిలిటీ సెంటర్‌లో 'ఐశ్వర్య ఫెర్టిలిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో అనధికారికంగా నిర్వహిస్తున్న ఫార్మసీపై డీసీఏ అధికారులు దాడులు జరిపారు. ఈ సోదాల్లో ఆ ఫార్మసీ లైసెన్స్ నకిలీదిగా అధికారులు గుర్తించారు. అందులో విధులు నిర్వర్తించే ఫార్మాసిస్ట్ వివరాలు కూడా నకిలీవేనని తేల్చి, స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డ్రగ్ లైసెన్స్ లేకుండా ఔషధాల అక్రమ నిల్వలు, విక్రయాలు జరుగుతున్నట్టు గుర్తించారు.

విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో అభివాదం చేస్తున్న విప్లవ పార్టీల నేతలు

3 సీపీఐ(ఎంఎల్) విప్లవ పార్టీలు విలీనం

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీగా ఆవిర్భావం
- ఇకపై ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని వెల్లడి

ముషీరాబాద్, జనవరి 20: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) రివల్యూషనరీ ఇన్షియేటివ్ అనే మూడు విప్లవ పార్టీలు విలీనమయ్యాయి. రాజకీయపరమైన నిర్మాణాత్మక పాత్ర పోషిస్తూ ప్రజల పక్షాన నిలవడమే లక్ష్యంగా మూడు పార్టీల నేతలు కలిసి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీగా ఏర్పడ్డారు. శనివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో మీడియా సమావేశంలో మూడు పార్టీల నేతలు కొత్త పార్టీ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పేరును ప్రకటించారు. మూడు పార్టీల నేతలు పోటు రంగారావు, గడ్డం సదానందం, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, కేజీ రాంచందర్, కే రంగారెడ్డి, కే రమ, ఆర్ చంద్రశేఖర్, వీ కృష్ణ, చంద్ర అరుణ, ఎం హన్మేశ్, ఎస్ఎల్ పద్మ కొత్త పార్టీ విధి విధానాలను వెల్లడించారు. ఐదు దశాబ్దాలుగా దేశంలో, రాష్ట్రంలో ప్రజా సంఘాలుగా చురుకైన పాత్ర పోషించిన విప్లవ పార్టీలు ఒక్కపార్టీగా ఆవిర్భవించి ఐక్యతతో ముందుకు సాగబోతున్నట్టు తెలిపారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా, లౌకిక విలువలకు అనుకూలంగా పోరాటం చేయనున్నట్టు చెప్పారు. మూడు విప్లవ పార్టీలు ఒకే పార్టీగా ఆవిర్భవించిన నేపథ్యంలో మార్చి 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో ప్రజాప్రదర్శన, బహిరంగ సభ, ప్రతినిధుల సభలు నిర్వహించనున్నట్టు తెలిపారు.